ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 17 మార్చి 2024

టెన్త్ విద్యార్థులకు బస్సులో ఉచిత ప్రయాణం




పుట్టపర్తి, మార్చి 16: జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాయడానికి కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు బస్సులో హాల్‌టిక్కెట్ చూపిస్తే ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. టెన్త్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఓడీసీలో పోస్టర్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

నియోజకవర్గం	ఓటర్లు
మడకశిర	2,09,671
హిందూపురం	2,45,610
పెనుకొండ	2,33,635
పుట్టపర్తి	2,09,345
ధర్మవరం	2,42,662
కదిరి	2,50,433



ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

అంతా రెడీ!



జిల్లా ఓటర్లు 13,91,356 .. మహిళా ఓటర్లే అధికం

పుట్టపర్తి, మార్చి 16: కొత్త జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ, మడకశిర, కదిరి, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 13,91,356 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 6,91,912, మహిళలు 6,99,382 మంది ఉన్నారు. ఇతర ఓటర్లు 62 మంది ఉన్నారు. యువ ఓటర్లు 26,303 మంది, దివ్యాంగులు 18,095 మంది, 80ఏళ్లు పైబడిన వృద్ధులు 7,300 మంది ఉన్నారు. జిల్లాలో 1571 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఎన్నికల నిర్వహణకు దాదాపు 10వేల మంది సిబ్బందిని వినియోగించనున్నారు. ఆయా నియోజకవర్గాల్లో రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఓటర్లు అత్యధికంగా కదిరి నియోజకవర్గంలో, అత్యల్పంగా పుట్టపర్తి నియోజకవర్గంలో ఉన్నారు.

ధర్మవరంలో ఈవీఎంలు



ఎన్నికల నిర్వహణ కోసం ధర్మవరం మార్కెట్‌యార్డులో ఈవీఎంలను భద్రపరిచారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటుచేసి భద్రతా ఏర్పాట్లను నిర్వహిస్తున్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకదృష్టి

జిల్లాలో 271 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించారు. వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. పోలీసులు సైతం ఆయా గ్రామాలపై తనిఖీలు, నిఘా ఉంచారు.

రెండు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు

ఎన్నికల నిర్వహణ అనంతరం ఓట్ల లెక్కింపు కోసం అధికారులు రెండు కేంద్రాలను గుర్తించారు. ఇందులో గోరంట్ల కేంద్రంలోని మాంటిస్సోరి స్కూల్‌లో ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. లేపాక్షిలోని ప్రభుత్వ పాఠశాలలో పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే చేపట్టారు.

సరిహద్దుల్లో నిఘా

జిల్లాకు సరిహద్దుగా కర్ణాటక ప్రాంతం ఉండటంతో కర్ణాటక నుండి అక్రమంగా మద్యం, నగదు, ఇతర వస్తువులు జిల్లాలోకి చేరకుండా ఆయా శాఖల అధికారులు ప్రత్యేక తనిఖీలతో పాటు నిఘా చేపట్టారు. కొత్త జిల్లాలో ఎన్నికల నిర్వహణను సవాల్‌గా తీసుకుని అధికారులు పనిచేస్తున్నారు.

ఇక ముసుగేయండి !

- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు
- ప్రభుత్వ ప్రచార కార్యక్రమాల పోస్టర్ల తొలగింపు

పుట్టపర్తి, మార్చి 16: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని వెంటనే బ్యానర్లు, హోర్డింగ్‌లు తొలగించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అధికారులతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. 24గంటల్లోపు మీ పరిధిలో ఉన్న పోస్టర్లు, బ్యానర్లను తొలగించాలని ఆదేశించారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని జూన్15వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని వివరించారు. అధికారులు ఎన్నికల నియమాలపై జాగ్రత్తగా ఉంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో కమాండో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని వివరించారు. ఓటు హక్కుకోసం ఫారం 6ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని, దీనిపై ఆయా రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.



ముదిగుబ్బలో నాయకుల విగ్రహాలకు ముసుగులు

అమల్లోకి కోడ్ — మోగిన ఎన్నికల నగారా..!



- ఎన్నికల సమరానికి రాజకీయ పార్టీల సంసిద్ధం
- ఒకే సారి ఎంపీ, ఎమ్మెల్యేల స్థానాలకు ఓటింగ్
- ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులు
- ఖరారైన వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థిత్వాలు
- ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం రెడీ

ఎన్నికల షెడ్యూల్ ఇలా

నామినేషన్ల ప్రారంభం	ఏప్రిల్ 18
నామినేషన్ల స్వీకరణకు తుది గడువు	ఏప్రిల్ 25
నామినేషన్ల పరిశీలన	ఏప్రిల్ 26
ఉపసంహరణకు ఆఖరిగడువు	ఏప్రిల్ 29
పోలింగ్	మే 13
ఓట్ల లెక్కింపు	జూన్ 4



పుట్టపర్తి, మార్చి16 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం మధ్యాహ్నం షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. శంకుస్థాపనలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, అధికార కార్యక్రమాలకు చెక్ పడింది. షెడ్యూల్ విడుదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు మొదలు పెట్టింది. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సాయుధ బలగాలతో సిద్ధమైంది. రాజకీయపార్టీలు ఎన్నికల రణక్షేత్రంలో తలపడేందుకు సై అంటున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేథ్యంలో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. అభ్యర్థుల ఎంపికలో వేగాన్ని పెంచాయి. జిల్లాలో ధర్మవరం నియోజకవర్గం మినహా ఆరు చోట్ల టీడీపీ గెలుపు గుర్రాలను ఖరారు చేసింది. దీంతో ఆయా అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టారు. వైసీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థితో పాటు ఏడు నియోజకవర్గాలకు ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే శనివారం అభ్యర్థులను ప్రకటించింది.




సమరానికి సై






సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల అవడంతో జిల్లాలో ఎన్నికల కురుక్షేత్రానికి రాజకీయ పార్టీలు సై అంటున్నాయి. ఇప్పటికే టీడీపీ జనసేన, బీజేపీ ఉమ్మడి గెలుపు గుర్రాలను బరిలోకి దింపాయి. హిందూపురం పార్లమెంట్ పరిధిలో హిందూపురం నుంచి నందమూరి బాలకృష్ణ, రాప్తాడు నుంచి పరిటాల సునీత, పెనుకొండ నుంచి ఎస్ సవిత, కదిరి నుంచి కందికుంట యశోదా దేవి, పుట్టపర్తి నుంచి పల్లె సింధూరరెడ్డి, మడకశిర నుంచి సునీల్‌కుమార్‌లను ఖరారు చేశారు. ధర్మవరంతో పాటు హిందూపురం పార్లమెంట్ స్థానాలకు ఖరారు చేయాల్సి ఉంది. వైసీపీ నుంచి హిందూపురం ఎంపీ అభ్యర్థిగా జే శాంతతోపాటు పుట్టపర్తికి శ్రీధర్‌రెడ్డి, ధర్మవరం కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, హిందూపురం దీపిక, మడకశిర ఈరలక్కప్ప, కదిరి నుంచి మక్బుల్ అహమ్మద్, రాప్తాడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిలను ఖరారు చేశారు.

అభివృద్ధి చేసేవారినే ఆదరించండి

- టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

కదిరి, మార్చి 16: కులం, మతం, ప్రాంతం చూడకుండా నియోజవర్గాన్ని అభివృద్ధి చేసేవారికి, ఆపదలో ఆదుకునేవారికే ఓటు వేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ కందికుంట యశోదాదేవికి టిక్కెట్ ఇవ్వడంపై ఆయన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2024లో జరుగుతున్న ఎన్నికలు విలక్షణమైనవన్నారు. రెండు సిద్ధాంతాలకు మధ్య ఈ ఎన్నిక జరుగుతోందన్నారు. అభివృద్ధి చేసే పక్షం కోసం నిలబడాలని కోరారు. గత 20సంవత్సరాలుగా మీతోనే ఉంటూ, మీ కష్టసుఖాల్లో పాలు పంచుకున్నానని గుర్తు చేశారు. ఈక్రమంలోనే నియోజకవర్గ ప్రజలు ఆదరించి ఒకసారి ఎమ్మెల్యేని చేశారన్నారు. 2014లో ఓడిపోవడానికి తానే కారణమన్నారు. 2019లో వచ్చిన సమీకరణాలతో పాటు పోల్ మేనేజ్‌మెంట్ సరిగా చేయకపోవడం వల్ల ఓడిపోయా మన్నారు. ఈఐదేళ్ల కాలంలో బాధ్యతగల ప్రతిపక్షంగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడ్డామన్నారు. కార్యకర్తలు, ప్రజల సంరక్షణ కోసం నిత్యం పోరాటం చేశామన్నారు. రానున్న 57 రోజులు టీడీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పర్యటించి టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యమని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మినేని గంగయ్యనాయుడు, మనోజ్, విశ్వనాథ్, అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

సారూ..! జీతం

వేతనం కోసం సమగ్రశిక్ష ఉద్యోగుల ఎదురుచూపు

- రెండునెలలుగా అందని వైనం
- ఆర్థిక ఇబ్బందుల్లో సమగ్రశిక్ష ఉద్యోగులు



ధర్మవరం, మార్చి 16: గత రెండు నెలలుగా వేతనాలు అందక ఏపీ సమగ్రశిక్ష పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇచ్చాకే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించండి అంటూ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గతంలో అన్న మాటలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దీంతో ఉద్యోగులు వేతనాలు లేక కుటుంబాలను పోషించుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ఆప్కాస్‌తో ప్రయోజనం ఏంటో?

రాష్ట్ర ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మేలు చేకూర్చుతామని, ఒకటో తేదీనే వేతనాలు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ పవర్ ఔట్ సోర్సింగ్(ఆప్కాస్)ను ఏర్పాటు చేసింది. అయితే దీని ద్వారా ఇప్పటివరకు ఎవరికీ సకాలంలో వేతనాలు పడిన దాఖలాలు లేవని కాంట్రాక్టు ఉద్యోగులు మండిపడుతున్నారు. తమ హక్కులపై డిసెంబరు 20 నుంచి జనవరి 10వతేదీ వరకు 22 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టారు. అప్పట్లో ప్రభుత్వ పెద్దలు సమ్మెకాలపు జీతాలు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చినా నేటికి దానిపై జీఓను కూడా జారీ చేయలేదని వారు వాపోయారు.

వేతనాలు మంజూరు చేయాలి



తాము రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. అయితే ప్రభుత్వం సకాలంలో జీతాలు చెల్లించకపోవడం చాలిచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నాం. ప్రభుత్వం రెండునెలల వేతనాలతో పాటు సమ్మెకాలపు బకాయిలు వెంటనే చెల్లించాలి.

- ఓబిరెడ్డి, సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

బిల్లులు పెట్టాం

సర్వశిక్ష కింద పనిచేస్తున్న కాంట్రాక్టు, ఒట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జనవరి, ఫిబ్రవరి నెల జీతాలు కోసం బిల్లులు పెట్టాం. ప్రభుత్వం నుంచి రాగానే వారి ఖాతాల్లోకి జమవుతుంది.

- మీనాక్షి, డీఈఓ

మామిడి.. నేరేడు తోటలకు నిప్పు

రూ.20 లక్షల ఆస్తి నష్టం.. బాధితుల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



కప్పలబండలో అగ్నికి ఆహుతైన మామిడి, అల్లనేరేడు చెట్లు

పుట్టపర్తి రూరల్, మార్చి 16: మండల పరిధిలోని కప్పలబండ గ్రామంలో శనివారం మామిడి, అల్ల నేరేడు తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం జరిగిందా, ఎవరైనా నిప్పు అంటించారా అన్నది తేలాల్సి ఉంది. గ్రామానికి చెందిన రైతులు వెంగమనాయుడు, రోశయ్యచౌదరితోపాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తోటలలో పండ్ల చెట్లు దగ్ధం కావడంతో రూ.20 లక్షల దాకా నష్టం జరిగింది. వెంగమనాయుడుకు చెందిన ఎనిమిది ఎకరాల తోటలో 1800 మామిడి చెట్లు, 150 అల్లనేరేడు చెట్లు, సూక్ష్మ సేద్య పరికరాలు ఆహుతయ్యాయి. దీంతో తనకు రూ.10 లక్షల దాకా పెట్టుబడి నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయారు. వెంగమనాయుడు తోట సమీపంలో ఉన్న రోశయ్య చౌదరికి చెందిన 150 మామిడిచెట్లు, సూక్ష్మ సేద్య పరికరాలు, దీనికి సమీపంలో ఉన్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తోటలోని 120 మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలను గుర్తించిన సమీప తోటలలోని రైతులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. వేసవి కావడం, మామిడి తోటలలో గడ్డి ఎండిపోవడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధిత రైతులు తెలిపారు.

ఆరోగ్యశ్రీకి.. అనారోగ్యం



ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించకపోవడంతో సోమవారం నుంచి వైద్య సేవలు నిలిపివేయాలని ప్రైవేట్ ఆస్పత్రులు నిర్ణయించాయి. ఉమ్మడి జిల్లాలో రూ.250 కోట్లపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు చెల్లించాలని ఎన్నిసార్లు ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోకపోవడతో ఈ నెల 18 నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసేందుకు ఆస్పత్రుల యాజమాన్యాలు సిద్ధమవుతున్నాయి. ఈ నిర్ణయంతో ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందాలనుకున్న రోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 60 ప్రభుత్వాస్పత్రులు, 55 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. ఈ ప్రైవేటు ఆస్పత్రులలో ఈనెల 18వ తేదీనుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోనున్నాయి.

- ధర్మవరం

రేపటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్ ?




- ప్రకటించిన నెట్‌వర్క్ ఆస్పత్రులు
- ఆందోళనలో పేద, మధ్యతరగతి ప్రజలు
- రూ. 250 కోట్లకు పైగా పేరుకుపోయిన బకాయిలు

పెండింగ్ బిల్లులు భారీగా పెరగడం, వివిధ వైద్య, ప్యాకేజీల ధరలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం, రోగులకు అందించిన చికిత్సలకు తగ్గట్టు ఫీజుల చెల్లింపులో జాప్యం చేస్తుండటంతో ఆరోగ్యశ్రీ సేవలను ఆపివేయాలని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపు సక్రమంగా జరగడంలేదు. దీంతో ఎప్పటికప్పుడు నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలను ఆపేస్తున్నాయి. గత ఏడాది మేలో ఇదే విధంగా సేవలు నిలిపివేతకు నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించగా ప్రభుత్వం హడావుడిగా ఆ నెలకు సంబంధించి కొంత బకాయిలు విడుదల చేసింది. మళ్లీ డిసెంబరులో చెల్లింపులు మందగించాయి. దీంతో అదే నెల 29 నుంచి ఆరోగ్య శ్రీ సేవల నిలిపివేతకు నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించాయి ప్రభుత్వం చర్చలు జరపడంతో వెనక్కి తగ్గాయి. ఆ తరువాత కూడా బిల్లుల చెల్లింపులో పురోగతి లేకపోవడంతో ఈ నెల 18 నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేసేందుకు సిద్ధమవుతున్నాయి.

ఆస్పత్రుల్లో అందని సేవలు

ప్రభుత్వం 3,255 రోగాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చింది. అయితే ఇందులో రుగ్మతలకు సంబంధించి ఆపరేషన్లు, వైద్యసేవలను చేర్చలేదన్న విమర్శలు ఉన్నాయి. ఆరోగ్య శ్రీ పరిధిలో వైద్యసేవల కోసం రోగి చేరిన నాటి నుంచి ఆపరేషన్ తరువాత వసతి, భోజనం, మందులు అందించాల్సి ఉంటుంది. దాదాపు ఆరునెలలు వరకూ వారికి మందులు అందించాలి. కానీ ఇదెక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు.ఒక్కో ఆరోగ్యశ్రీ కార్డుకు రూ.25లక్షల వరకూ వెసులబాటు ఉంటుంది. రోగికి వైద్యపరీక్షలు, ఆపరేషన్లు, మందులు భోజనం, వసతి ఇవన్నీ లెక్క కట్టి ఆ మొత్తంలో తీసుకుంటారు. అయితే కొన్ని ఆస్పత్రులు ఖర్చుకు మించి ఆరోగ్యశ్రీలో జమ చేసుకుంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి. మరో పక్క ఆరోగ్యశ్రీ ద్వారా అత్యవసర వైద్యసేవల కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్న వారికి అక్కడ చుక్కెదురవుతోంది. ప్రభుత్వం మాత్రం ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి లబ్దిదారుడికి రూ.25లక్షల సాయం అందుతుందని చెబుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం ఆస్పత్రులు రకరకాలుగా కొర్రీలు పెడుతున్నాయి. ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్లు చెబుతున్న దానికి, ఆస్పత్రి సిబ్బంది చెబుతున్న దానికి పొంతన ఉండటంలేదు. ప్రధానంగా నిరక్షరాస్యులు, అవగాహన లేనివారు వెళ్తుంటే ముప్పుతిప్పలు పెడుతున్నారు. దీంతో ఆరోగ్యశ్రీ కంటే సాధారణ వైద్యానికే వారు మొగ్గుచూపుతున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పెండింగ్ బిల్లులు పెరుగుతుండటంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు సాధారణ వైద్యానికే ప్రాధాన్యం ఇస్తున్నాయి.



ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుంది

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆరోగ్య శ్రీ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.250 కోట్లకుపైగా చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం. వందతులు నమ్మవద్దు. ఆరోగ్య శ్రీ సేవలను ప్రైవేటు ఆస్పత్రులు ఆపేస్తామంటే వాటి అనుమతులను రద్దు చేస్తాం.

- కిరణ్ కుమార్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

లింగారెడ్డిపల్లి సమీపంలో చిరుతల సంచారం

పొలాలను పరిశీలించిన అటవీ అధికారులు



ఓ పొలం వద్ద చిరుతపులి అడుగులను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారి



వృత్తాలలో చిరుతపులి అడుగులు

కొత్తచెరువు, మార్చి 16: మండలంలోని లింగారెడ్డిపల్లి సమీపంలో గల వ్యవసాయ పొలాల్లో చిరుతపులులు సంచరిస్తున్నాయని రైతులు తెలిపారు. స్థానిక విశ్రాంత ఉపాధ్యాయుడు హరిప్రసాద్ గొర్ల పెంపకం షెడ్ల వద్దకు గత శుక్రవారం రాత్రి 7గంటల ప్రాంతంలో వచ్చాయన్నారు. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో చిత్రావతి వంకలోకి పరుగులు తీశాయన్నారు. గత వారం కిందట అవి 15 గొర్రెలను చంపి తిన్నాయన్నారు. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు శనివారం వ్యవసాయ పొలాలను పరిశీలించారు. చిరుతపులి అడుగులను సెక్షన్ ఆఫీసర్ చంద్రానాయక్ గుర్తించారు. రైతులు వ్యవసాయపొలాల వద్దకు రాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్లరాదని ఆయన సూచించారు. ఎక్కడైనా చిరుతలు సంచరించినటు తెలిస్తే తమకు వెంటనే సమాచారం అందించాలని చెప్పారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.33 ఆదివారం (సాయంత్రం)	5.05 సోమవారం (ఉదయం)
కదిరి	6.31 ఆదివారం (సాయంత్రం)	5.11 సోమవారం (ఉదయం)
ధర్మవరం	6.36 ఆదివారం (సాయంత్రం)	5.08 సోమవారం (ఉదయం)
హిందూపురం	6.34 ఆదివారం (సాయంత్రం)	5.12 సోమవారం (ఉదయం)
పెనుకొండ	6.32 ఆదివారం (సాయంత్రం)	5.09 సోమవారం (ఉదయం)

రాక్షస పాలనకు స్వస్తి పలుకుదాం

● ఎన్నికల ప్రచారంలో పల్లె సింధూరా రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న పల్లె సింధూరరెడ్డి తదితరులు

పుట్టపర్తి రూరల్, మార్చి 16: మీబిడ్డగా ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరా రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. మండలంలోని నిడిమామిడి, పంచాయతీలోని గాజులపల్లి, బుగ్గపల్లి, కత్తివారిపల్లి గ్రామాల్లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని భర్త పల్లె వెంకట కృష్ణకిశోర్ రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటా తిరిగి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. అరాచక వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని, ప్రజా సంక్షేమాన్ని కోరే టీడీపీని గెలిపించాలని కోరారు. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజవర్గంలో ఇరిగేషన్‌కు అత్యధిక ప్రాధాన్యతనిస్తానని, 193 చెరువులకు నీరందిస్తానని తెలిపారు. అలాగే సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు శ్రీరామ్‌నాయక్, బొమ్మయ్య, నాగరాజు, మెహరాలి, వీరభద్ర, కేశవ, శ్రీరాములు, కుళ్లాయప్ప, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

17 కుటుంబాలు టీడీపీలోకి చేరిక



టీడీపీలో చేరిన వారితో పల్లె రఘునాథరెడ్డి

ఓబుళదేవర చెరువు, మార్చి 16: మండలంలోని వనుకువారిపల్లికి చెందిన 17 కుటుంబాల వారు శనివారం వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి తుమ్మలకుంట్లపల్లిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా వనుకువారిపల్లి వాసులు ఆయన్ను కలిసి టీడీపీలోకి చేరారు. వారికి పల్లె కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరినవారిలో రమాదేవి, లక్షమ్మ, బి.సురేష, అనిత, శివప్రసాద్, మునెమ్మ, రామాంజనేయులు, పద్మావతి, వెంకటలక్ష్మమ్మ, వెంకటమ్మ, రంగమ్మ, నాగలక్ష్మి, లక్షమ్మ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండలకన్వీనర్ శెట్టివారి జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కందుకూరిపల్లి కృష్ణమూర్తి, ఆర్‌ఎంపీ జాకీర్, శ్రీరాముల నాయుడు, వెంకటేష్ నాయుడు, గౌస్‌పీర్, జనార్దన్‌రెడ్డి, నరసింహారెడ్డి, రా జు, టీఎన్ఎస్ఎఫ్ ఇర్ఫాన్, మాజీ కన్వీనర్ రాజారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, బీసీ సెల్ అంజనప్ప, జనసేన మండల కార్యదర్శి మేకల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 182 కేసుల పరిష్కారం

ధర్మవరం, మార్చి 16: పట్టణంలోని కోర్టులో శనివారం జరిగిన మెగా లోక్‌అదాలత్‌లో సుమారు 182 కేసులను పరిష్కారం చేసినట్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి గీతావాణి పేర్కొన్నారు. ఇందులో విడాకుల కేసులు 4, బ్యాంకు రుణం కేసులు 27, సివిల్ కేసులు 24, గొడవల కేసులు 48, చెక్‌బౌన్స్ కేసులు 6, భరణం కేసులు 4, పేకాట కేసులు 61, సారా కేసులు 8 చొప్పున మొత్తం 182 కేసులు పరిష్కరించామన్నారు. రాజీమార్గం ద్వారా ఈ లోక్‌అదాలత్‌లో కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చని చెప్పారు. జూనియర్‌సివిల్ న్యాయాధికారి శివపార్వతి, రమ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

కేసుల రాజీతోనే శాంతి

కదిరిలీగల్: కేసులు రాజీచేసుకుని జీవించడం ద్వారా శాంతి నెలకొంటుందని మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్‌పర్సన్, న్యాయాధికారి ఎస్. జయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఇందులో పలు కేసులను పరిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేసుల్లో ఇరుక్కొని పోలీసుల చుట్టూ తిరగడం వల్ల వ్యయప్రయాసలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. జరిగిన పొరపాటును సరిదిద్దుకోవడానికి, ఇరువర్గాలు రాజీకుదుర్చుకోవడానికి, కేసులు పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయాధికారి ఎస్ ప్రతిమ, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

నల్లచెరువు, మార్చి 16: మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం జరిగింది. ఆలయం ఆవరణలో భజన మండలి సభ్యులు చేపట్టిన భజన కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఆలయ ఈఓ షరీఫ్, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో 'జ్ఞానసుధ' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు బెన్నీష్‌రెడ్డి, ఇంద్రకుమార్, అన్విత

కదిరిఅర్బన్, మార్చి 16: సైనిక స్కూల్ ప్రవేశ ఫలితాల్లో పట్టణంలోని జ్ఞానసుధ కోచింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు నిర్వాహకులు మస్తాన్ శనివారం తెలిపారు. గత గురువారం విడుదల అయిన ఫలితాల్లో తమ కోచింగ్ విద్యార్థులు బెన్నీష్‌రెడ్డి 300/ 245, ఇంద్రకుమార్ 300/235, అన్విత 300/ 223, అనీష్ 300/ 216, రాహుల్ 300 /213, యమున 208, చరణ్‌తేజ 210తోపాటు మరో 15మంది విద్యార్థులు రెండువందలకు పైగా మార్కులు సాధించారన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

బీఎస్‌ఎఫ్ బలగాల కవాతు

ధర్మవరం రూరల్, మార్చి 16: పట్టణంలోని తారకరామాపురం, గూడ్స్‌షెడ్‌కొట్టాల, శారదానగర్, శాంతినగర్, కదిరిగేటు మీదుగా బీఎస్‌ఎఫ్ బలగాలు శనివారం టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ప్రజలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలని సీఐ సూచించారు. ముఖ్యంగా ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని సూచించారు. గొడవలు పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కవాతులో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న బీఎస్‌ఎఫ్ బలగాలు

పరిటాల శ్రీరామ్‌కే టిక్కెట్ ఇవ్వాలి

● ధర్మవరంలో కదం తొక్కిన టీడీపీ శ్రేణులు
● ప్రధాన సర్కిళ్లలో భారీ ర్యాలీ
● పొత్తులకు, బీజేపీకి మేము వ్యతిరేకం కాదు



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ధర్మవరం, మార్చి 16: ధర్మవరం నియోజకవర్గ టీడీపీ టిక్కెట్ పరిటాల శ్రీరామ్‌కు కేటాయించాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు , పరిటాల అభిమానులు కదం తొక్కారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, పరిటాల అభిమానులు శనివారం వేలాదిగా ధర్మవరంలోని కాలేజీ సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి గాంధీసర్కిల్‌వరకు ర్యాలీ చేపట్టారు. గోనుగుంట్ల సూరి మా కొద్దు అంటూ నినదించారు. ఈ ర్యాలీ కాలేజీ సర్కిల్ నుంచి కళాజ్యోతి, అంజుమన్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీసర్కిల్ వరకు కొనసాగించారు. అక్కడ పలువురు నాయకులు మాట్లాడుతూ.. గోనుగుంట్ల సూర్యనారాయణ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఏ రోజూ కార్యకర్తలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అయినా.. 2019 ఎన్నికల్లో సహకరించామన్నారు. కాగా ఓడిపోయిన కొద్ది రోజులకే ఆయన టీడీపీని, నమ్ముకున్న కార్యకర్తలను వదిలేసి బీజేపీలోకి చేరారన్నారు. కేవలం తన వ్యాపారాల కోసమే పార్టీని వీడిపోయారన్నారు. పార్టీ కార్యకర్తలు అనాథల్లా మారితే పరిటాలశ్రీరామ్ ఇక్కడికి వచ్చారన్నారు. అప్పుడు కూడా చంద్రబాబు ఆదేశించిన తరువాతే పరిటాల శ్రీరామ్ వచ్చారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కార్యకర్తలకు అండగా ఉంటూ ధర్మవరంలో టీడీపీకి ఊపిరి పోశారన్నారు. కానీ ఇప్పుడు పొత్తుల్లో భాగంగా సూరికి టిక్కెట్ ఇస్తారన్న ప్రచారం జరుగుతుండడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పొత్తులకు, బీజేపీకి తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే కష్టకాలంలో పార్టీని వదలివెళ్లిన వారికి టిక్కెట్ ఇస్తామంటే ఒప్పుకోమన్నారు. నియోజవకర్గంలో నాలుగున్నరేళ్లుగా టీడీపీ కోసం కష్టపడుతున్న పరిటాల శ్రీరామ్‌కే టిక్కెట్ ఇవ్వాలన్నారు. టీడీపీ భారీ మెజారిటీతో గెలుపొందే అవకాశం ఉన్న ప్రస్తుత తరుణంలో టికెట్‌ను కేటాయించకపోవడం దారుణమన్నారు. ఒకవేళ పొత్తులో భాగంగా తప్పనిసరి పరిస్థితుల్లో బీజేపీకి ఇవ్వాల్సి వస్తే సూరికి కాకుండా ఎవరికి ఇచ్చినా సహకరిస్తామన్నారు. సూరికే టికెట్ ఇస్తే తామంతా మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని వారు హెచ్చరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న ఆదిలాబాద్ భక్తులు

పుట్టపర్తి, మార్చి 16: ఆదిలాబాద్ భక్తులు సంగీత సాంస్కృతిక కార్యక్రమాలతో సందర్శకులను అలరింపజేశారు. పట్టణంలోని సాయికుల్వంత్ మందిరంలో శనివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్‌కు చెందిన బాలవికాస్ సత్యసాయి యూత్ బృందం సభ్యులు మాణిక్యం పేరిట డ్యాన్స్‌డ్రామాను నిర్వహించారు. సుమారు గంట పాటు సంగీత నృత్యం, నటనతో భక్తులను అలరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ

బత్తలపల్లి, మార్చి16: మండలకేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో పోలీస్ శాఖ వారు ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ఎస్ఐ శ్రీనివాసులు శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయన్నారు. బాటసారుల దాహార్తి తీర్చడానికి ఈ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ



సరస్వతి విగ్రహం వద్ద ఉపాధ్యాయులు

ఓబుళదేవరచెరువు, మార్చి 16: మండలంలోని మిట్టపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు శనివారం సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. తర్వాత హాల్ టిక్కెట్లను అమ్మవారి విగ్రహం ఎదుట ఉంచి పూజలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రామచంద్రారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాపోరాటాలకు బాసటగా నిలవండి: సీపీఐ



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

ఓబుళదేవరచెరువు, మార్చి 16: ప్రజా సమస్యలపై సీపీఐ చేసే పోరాటాలకు ప్రజలు బాసటగా నిలవాలని ఆ పార్టీ మండల కార్యదర్శి చలపతినాయుడు కోరారు. మండలకేంద్రంలోని దుకాణాలు, వివిధ ప్రాంతాల్లో శనివారం ఆయన పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఐకి విరివిగా విరాళాలిచ్చి ప్రజాపోరాటాలకు బాసటగా నిలవాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో మహిళ సంఘం నాయకురాలు రత్నాబాయి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు శానిటరీ కిట్ల పంపిణీ

ధర్మవరం, మార్చి 16: మున్సిపాలిటీలో పనిచేస్తున్న 50 మంది పారిశుధ్య కార్మికులకు శానిటరీ కిట్లను శనివారం రెడ్‌క్రాస్, యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పంపిణీ చేశారు. స్థానిక కొత్తపేట ఉషోదయ స్కూల్‌లో పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, ఫౌండేషన్ ప్రెసిడెంట్ శీలానాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండినాగేంద్ర సభ్యులు కలిసి శానిటరీ కిట్లను అందజేశారు.

యువకుడి ఆత్మహత్య

మడకశిర రూరల్, మార్చి 16: మండలంలోని మణూరుకు చెందిన నర సింహమూర్తి(33) అనే యు వకుడు శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చే సుకున్నట్లు గ్రామస్థులు తెలి పారు. వారు తెలిపిన మేర కు.. నరసింహమూర్తి కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవ నం సాగిస్తున్నాడు. అతడు మద్యానికి బానిస కావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. దీంతో మనస్తాపం చెంది మణూరు సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సువర్ణమ్మ, తల్లి జయమ్మ, ఇద్దరు కుమారులున్నారు. స్థానికుల స మాచారంతో పోలీసులకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. భార్య సువర్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

నల్లమాడ, మార్చి 16: ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు తెలిపారు. మండలంలో జిల్లాపరిషత్ పాఠశాల, ప్రభుత్వ ఎస్టీ ఆశ్రమ పాఠశాలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 293 రెగ్యులర్ విద్యార్థులతో పాటు 80మంది సప్లమెంటరీ విద్యార్థులు, ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో 154మంది రెగ్యులర్ విద్యార్థులతోపాటు 38మంది సప్లమెంటరీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలమన్నారు.

ఘనంగా మహిళాదినోత్సవం

గాండ్లపెంట, మార్చి 16: మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఎఫ్ఈఎస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇరిగేషన్ జేఈ అరుణకుమార్, ఏఓ లక్ష్మీప్రియ హాజరై మాట్లాడారు. మహిళలు స్వయం శక్తితో అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అప్పుడే అత్యున్నత స్థాయికి వెళతారన్నారు. ఏపీఎం సూర్యనారాయణ మాట్లాడుతూ మహిళా చట్టాలు, హక్కుల గురించి వివరించారు. ఎఫ్ఈఎస్ టీమ్‌లీడర్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎవరూ కూడా ఆడపిల్లలపై వివక్షత చూపరాదన్నారు. సమావేశంలో ఎఫ్ఈఎస్ సిబ్బంది ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడి మృతి

తనకల్లు, మార్చి 16: మండలంలోని రాజోనిమిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ దివ్యాంగుడు అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మించిలివారికోటకు చెందిన దివ్యాంగుడు సత్యనారాయణ(38) కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి నుంచి శుక్రవారం రాత్రి తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో కలిసి గొర్రెలను ఆటోలో తీసుకొస్తున్నారు. కాగా సత్యనారాయణ ఆటోపైనున్న క్యాబిన్‌పై కూర్చున్నాడు. కొక్కంటి సమీపంలో రాజోనిమిట్టవద్దకు రాగానే డ్రైవర్ వెంకటరమణ షడన్‌బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. దీంతో సత్యనారాయణ కిందపడి తీవ్రగాయాలపాలై అక్కడిక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య, చిన్నారులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు.

వ్యక్తిపై దాడి.. పలువురిపై కేసు నమోదు

కదిరి అర్బన్, మార్చి 16: కదిరి మండలంలోని బత్తపల్లి గ్రామంలో వ్యక్తిపై దాడి చేసిన సంఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మయ్య పొలంలో సమీప బంధువులైన ఓబులకొండ, చిన్నరాయుడు, తదితరులు పంట పెట్టడానికి దున్నుతుండగా.. లక్ష్మయ్య తమ పొలంలో ఎందుకు వ్యవసాయం చేస్తున్నారని అడ్డుపడ్డారు. దీంతో వాగ్వావాదం జరిగి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఓబులకొండ, చిన్నరాయుడు, నాగరాజు, రెడ్డెప్ప, పుష్పలత, కాంతమ్మపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

దర్గాలోని హుండీ కానుకల చోరీ

తాడిమర్రి, మార్చి 16: మండలకేంద్రంలోని ఉన్నతపాఠశాల వెనుక వైపు ఉన్న దర్గాలోని హుండీని శుక్రవారం గుర్తుతెలియని దుండగులు పగలకొట్టి అందులో ఉన్న రూ.25వేలు నగదును దోచుకెళ్లారు. దుండగులు దర్గాలోకి ప్రవేశించి హుండీని సమీపంలోని కంపచెట్లలోకి ఎత్తుకెళ్లారు. అక్కడ పగలకొట్టి రూ.25వేలు నగదును దోచుకెళ్లారు. దీనిని శనివారం గుర్తించిన స్థానికుడైన షాజహాన్ ఎస్ఐ నాగాస్వామికి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

యశోదాదేవిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం: జనసేన



కందికుంట యశోదాదేవికి శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నాయకులు

కదిరిఅర్బన్, మార్చి 16: కదిరి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దిగిన కందికుంట యశోదాదేవిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని జనసేన నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని కందికుంట నివాసంలో శనివారం వారు యశోదాదేవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి యశోదాదేవిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి సైనికుల్లా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్, నాయకులు బ్లూమూన్ శివశంకర్, గవ్వల శ్రీనివాసులు, చిన్నప్పరెడ్డి, చిల్లా మహేష్, రవికుమార్, రవీంద్రనాయక్, కాయల చలపతి, కుటాల లక్ష్మన్, అంజిబాబు, సాయిప్రియ, అశ్వర్థకుమార్, సత్యవతి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై దివ్యాంగులకు అవగాహన సదస్సు



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న డీఆర్వో కొండయ్య

పుట్టపర్తి, మార్చి 16: ప్రజల్లో చైతన్యం వచ్చేవిధంగా దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఆర్వో కొండయ్య తెలిపారు. కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులకు, వయో వృద్ధులకు శనివారం ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. వికలాంగులు, 85 ఏళ్ల వయసు దాటిన వృద్ధులు ఓటు హక్కును ఇంటి నుంచే వినియోగించుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నోటిఫికేషన్ రాగానే వారం రోజుల్లో ఫారం-డీతో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పిస్తామన్నారు. దీనిని రహస్యంగా వినియోగించు కోవాలని సూచించారు. తర్వాత ఓటర్లలో చైతన్యం కల్గించే వాల్‌పోస్టర్లను డీఆర్వో దివ్యాంగులు, అధికారులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో చీఫ్ నోడల్ అధికారి శివరంగప్రసాద్, సంక్షేమశాఖ సూపరింటెండెంట్ వెంకటరమణ, ఈడీటీ షైనొద్దీన్, వికలాంగ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఈశ్వరమ్మ స్కూల్లో సైన్స్‌ల్యాబ్ ప్రారంభం



సైన్స్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఆర్జే రత్నాకర్ తదితరులు

పుట్టపర్తి, మార్చి 16: పట్టణంలోని సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ పేరిట ఉన్న పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. సత్యసాయిసెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్‌చైర్మన్ చక్రవర్తి ముఖ్యఅతిథులుగా పాల్గొని ల్యాబ్ ప్రారంభించారు. 10వ తరగతి వరకు మాత్రమే ఉన్న ఈ పాఠశాలలో ఇటీవల ఇంటర్ తరగతులను ప్రారంభించారు. దీంతో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు గదులతో పాటు అన్ని హంగులతో సైన్స్‌ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



పొట్టిశ్రీరాముల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, మార్చి16: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పట్టణంలో టీడీపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మా ట్లాడుతూ తెలుగువారికి ప్ర త్యేక రాష్ట్రం ఉండాలనే త పనతో పొట్టిశ్రీరాములు ఆం ధ్ర రాష్ట్ర అవతరణ కోసం త మ ప్రాణాలు సైతం త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆమరణ నిరాహా ర దీక్ష చేపట్టి చివరికి ప్రాణ త్యాగం చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించి తెలుగువారి గుండెల్లో అమరజీవిగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమ తం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, మున్సిపల్ మాజీ చైర్మెన్లు కాచర్ల కం చన్న, బీరేగోపాలకృష్ణ, నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, భీమనేనిప్రసాద్‌నాయు డు, అం బటి సనత్, మేకల రామాంజినేయులు, కేశగాళ్లశీన, కత్తుల బాబ్జీ, పుల్లపు రవీంద్ర, టైలర్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కేహెచ్‌ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు కలిసి పొట్టిశ్రీరాముల జయంతిని జరుపుకున్నారు.

అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా ఉద్యోగోన్నతులు

కొత్తచెరువు, మార్చి 16: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులుగా పని చేస్తున్న 197 మందికి ప్రభుత్వం ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు కల్పించిందని డీఐఈఓ రఘునాథరెడ్డి, ఆర్ఐఓ సురేశ్‌బాబు శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలోని 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రెగ్యులర్ ప్రిన్సిపాళ్ల నియమితులయ్యారన్నారు. దీంతో కొత్తచెరువు సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జ్యోతిర్లత, పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుదర్శన్ బాధ్యతలు స్వీకరించారన్నారు. మిగిలిన కళాశాలల్లో పదోన్నతి పొందినవారు కూడా బాధ్యతలు చేపట్టినట్లు వారు తెలిపారు.

నాటుసారా ఊట ధ్వంసం

కదిరి అర్బన్, మార్చి 16: మండలంలోని కారెడ్డిపల్లి ప్రాంతంలో మూడువందలలీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేసినట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు. శనివారం గ్రామ సమీపంలో తమ సిబ్బందితో దాడులు చేసి, మూడువందల లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశామన్నారు. ఆయనతోపాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ, మార్చి16: మండలంలోని సంకేపల్లి గ్రామ సమీపాన జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైనట్లు 108 సిబ్బంది తెలిపారు. వారి వివరాల మేరకు ముక్తాపురం గ్రామానికి చెందిన తండ్రీ కుమారుడు బాలాజీనాయక్, మనోజ్‌నాయక్ ముదిగుబ్బ నుంచి బత్తలపల్లి వైపు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా.. సంకేపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

గ్రూప్-1 పరీక్షలకు
సర్వం సిద్ధం



● ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ ● గుర్తింపు కార్డు తప్పనిసరి ● దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు : కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 16: ఏపీపీఎస్సీ ఆదివారం నిర్వహిస్తున్న గ్రూప్-1 స్ర్కీనింగ్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టరు గౌతమి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఆమె కలెక్టరేట్‌లో వెల్లడించారు. జిల్లాలో 11,597మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. వీరి కోసం 33 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రెండు పూటలా పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఒక్కనిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించమన్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ర్టానిక్ వస్తువులు పరీక్షాహాల్‌లోకి తీసుకురాకూడదని సూచించారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తోపాటు ప్రభుత్వంచే జారీచేయబడిన ఏదైన గుర్తింపుకార్డు తీసుకొని రావాలన్నారు. దివ్యాంగులు మొదటి ఫ్లోర్‌లోనే పరీక్ష రాయడానికి ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. సందేహాలు ఉంటే 08554- 220009 నెంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 33 మంది సీనియర్ అధికారులను లైజన్ ఆఫీసర్లుగా నియమించామని. అందరూ సమన్వయంతో పనిచేసి గ్రూప్-1 పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

● పేపర్‌లీక్, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు: కలెక్టర్


అనంతపురం టౌన్. మార్చి 16 : పదోతరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. జిల్లాలో ఈఏడాది 40,063మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 142 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈనెల 18నుంచి పరీక్షలు మొదలవుతాయని ఉదయం 9-30 గంటలనుంచి మధ్యాహ్నం 12-45 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు ఉదయం 8-40గంటలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. ప్రతి ప్రశ్నా పత్రానికి ఒక క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షల్లో పేపర్‌లీక్. మాల్‌ప్రాక్టీస్ జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షాకేంద్రాలను నో మొబైల్ జోన్లుగా ప్రకటించడం జరిగిందన్నారు. వేసవి నేపథ్యంలో కేంద్రాల వద్ద తాగునీరు అందుబాటులో ఉంచామని. ప్రత్యేకంగా మెడికల్‌క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. అన్నికేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఇదిలా ఉంటే పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్ చూపితే ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని, విద్యార్థులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు కలెక్టరు సూచించారు.

నగుబాటు పనులు

గత ప్రభుత్వం ప్రారంభించిన పనులపై వైసీపీ సర్కార్ శీతకన్ను

● తాడిపత్రిలో అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణాలు
● ప్రారంభం కాకమునుపే నెర్రెలు చీలుతున్న గోడలు
● ఆయా నిర్మాణాల వద్ద పెరుగుతున్న పిచ్చి మొక్కలు
● కోట్ల రూపాయల ప్రజాధనం వృథా
● పట్టించుకోని అధికారులు, పాలకులు

తాడిపత్రిటౌన్: పట్టణంలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. దీంతో నిర్మాణాలు పూర్తికాకమునుపే గోడలు నెర్రెలు చీలుతున్నాయి. బండ్ల పరుపు దెబ్బతింటున్నాయి. పట్టణంలోని శ్రీనివాసపురంలో పశువుల ఆసుపత్రితోపాటు ల్యాబ్ నిర్మాణానికి దాదాపు రూ.80లక్షలు నిధులు మంజూరయ్యాయి. నిధులు మొత్తం ఖర్చుచేసి నిర్మాణం దాదాపు పూర్తి చేశారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి ఇంకా రూ.20లక్షల మేర నిధులు కావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నూతన భవనం శిథిలావస్థకు చేరుకుంది. అలాగే గత టీడీపీ పాలనలో యువతకు క్రీడల్లో నైపుణ్యం పెంచాలన్న ఉద్దేశంతో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రూ.2 కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులు గోడలకే పరిమితమయ్యాయి. ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ నిర్మాణం ఆగిపోయింది. చిన్న బజారులోని పాతకూరగాయల మార్కెట్ సమీపంలో రూ.26లక్షల వ్యయంతో చేపట్టిన షాదీఖానా భవన నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయిం ది. ఆ స్థలంలో పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. శ్రీనివాసపురం సమీపంలో పెన్నానది ఒడ్డున కేజీబీవీ నిర్మాణం కోసం రూ.1.5కోట్లు ఖర్చుచేయగా మిగిలిన నిర్మాణ పనుల కోసం అదనంగా మరో రూ.2 కోట్లు కావాల్సి ఉంది. పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. నదిలో నిర్మాణం చేపట్టడంతో సేఫ్టీవాల్ కోసం కావాల్సిన నిధులను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పాతకోటలో రూ.80లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిధుల లేమితో మధ్యలోనే ఆగిపోయింది. ఉపకేంద్రం నిర్మాణం పూర్తయితే స్థానికులకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటిపై పాలకులు దృష్టిపెడితే బాగుంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.



శిథిలావస్థకు చేరిన పశువుల ఆసుపత్రి భవనం



గోడలు నెర్రెలు చీలిన దృశ్యం



నిలిచిపోయిన షాదీఖానా పనులు



మొండిగోడలతో దర్శనమిస్తున్న ఇండోర్ స్టేడియం



దెబ్బతిన్న బండ్ల పరుపు

రూ.5 కోట్ల ప్రజాధనం వృథా

ప్రజలకు సౌకర్యాలను అందుబాటులోకి తేవాలన్న తలంపుతో గత టీడీపీ ప్రభుత్వం భవనాల నిర్మాణాల కోసం విడుదల చేసిన రూ.5కోట్లు వృథాగా మారాయి. 2019ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ గత టీడీపీ ప్రభుత్వం తలపెట్టిన నిర్మాణాలపై శీతకన్నువేసింది. నిధులు తక్కువగా ఉన్న వాటికి అదనపు నిధులు ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఇలా ఏళ్ల గడుస్తుండటంతో భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో రూ. కోట్ల ప్రజాధనం వృథాగా మారింది. అధికారులు, పాలకులు తగు చొరవ చూపి భవనాల నిర్మాణాలు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఆద్యంతం..అద్భుతం..!

● గవర్నర్ ముందు ఆద్యలక్ష్మి నృత్యప్రదర్శన
● ప్రశంసలందుకున్న అనంత చిన్నారి

అనంతపురం కల్చరల్, మార్చి 16 : మూడేళ్ల చిన్నారి..ముద్దుముద్దుగా అడుగులేసే వయస్సులో.. అద్భుతంగా నాట్యప్రదర్శన చేసి గవర్నర్‌తో ప్రశంసలు అందుకుంది. అనంతపురం నగరానికి చెందిన మూడున్నర సంవత్సరాల చిన్నారి ఆద్యలక్ష్మి రాష్ట్ర గవర్నర్ ముందు నృత్య ప్రదర్శననిచ్చింది. చిన్నారి ఆద్యలక్ష్మి మూడేళ్లకే సంప్రదాయ భరతనాట్యంలో మెలకువలు నేర్చుకుని ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటకలోనూ మైమరిపించే ప్రదర్శనతో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుకుంది. విషయం తెలుసుకున్న గవర్నర్ శనివారం రాజ్ భవన్‌కు చిన్నారి ఆద్యలక్ష్మిని పిలిపించుకోగా గవర్నర్ సమక్షంలో అద్భుతంగా నృత్య ప్రదర్శననిచ్చింది. మురిసిపోయిన గవర్నర్, చిన్నారిని ఎత్తుకుని ఆప్యాయంగా పలకరించడంతోపాటు ప్రభుత్వపరంగా తనవంతు సహాయ సహకారాలందిస్తానని హామీ ఇచ్చారు. 'తానా' సభల్లో నృత్యప్రదర్శనిచ్చేలా సిఫారసు చేస్తానన్నారు.



చిన్నారిని ప్రశంసిస్తున్న గవర్నర్



గవర్నర్ ముందు నృత్యప్రదర్శన ఇస్తున్న ఆద్యలక్ష్మి

కఠోర శ్రమకు నిదర్శనం మాకం

● ఆదర్శంగా తీసుకోవాలి ● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి

హిందూపురం, మార్చి 16 : ఎంతో కఠోర శ్రమ చేస్తే తప్ప ఫలితం దక్కదని, అందుకు ఉదాహరణ మాకం శ్రీధర్ అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి అన్నారు. హిందూపురానికి చెందిన మాకం శ్రీధర్ కర్ణాటక తరఫున పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయనకు శనివారం ఎస్‌డీజీఎస్ కళాశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాల పూర్వ విద్యార్థి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడుతూ.... ఏదైనా ఫలితం రావాలంటే కఠోర శ్రమ చేయాలన్నారు. హిందూపురానికి చెందిన మాకం శ్రీధర్ చిన్ననాటి నుంచి జీవితంలో ఏదైనా సాధించాలనే లక్ష్యంతో కష్టపడటం వల్లే పద్మశ్రీకి ఎంపికయ్యారని కొనియాడారు. స్వాతంత్ర్యం అనంతరం జన్మించిన వారిలో పద్మశ్రీకి ఎంపికైన ఉమ్మడిజిల్లాకు చెందిన మొదటి వ్యక్తి మాకం శ్రీధర్ అన్నా రు. ఆయన కర్ణాటకలో విద్యారంగం అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ఇప్పటికీ ఏదో సాధించాలన్న దృఢసంకల్పంతో వెళ్తున్న ఆయనను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాకం శ్రీధర్ మాట్లాడుతూ సమష్టి కృషితోనే తాను ఈ అవార్డుకు ఎంపికయ్యానన్నారు. తాను మైసూరు విద్యాలయం నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అందుకున్నానని, విజయ కళాశాల కామర్స్ విభాగంలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేశానన్నారు. సాహిత్యం, విద్యారంగంలో తాను చేసిన సేవను గుర్తించి పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేశారన్నారు. పలువురు వక్తలు శ్రీధర్ జీవిత చరిత్రను తెలియజేశారు. అనంతరం మాకం శ్రీధర్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డితోపాటు పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీజీఎస్ కళాశాల అధ్యక్షుడు రేవూరి చంద్రమోహన్, కార్యదర్శి బైసాని రాంప్రసాద్, ఉపాధ్యక్షులు దాసా సందీప్, గంగాధర్, నందకిశోర్, ప్రిన్సిపాల్ ప్రసాద్, నాగేంద్ర, ప్రొఫెసర్ నరహరి, పార్థసారథి, జేపీకే రాము, బీఎస్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



పద్మశ్రీ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి

తెలుగు వారందరూ
కదలిరండి..

● టీడీపీని గెలిపించడం అందరి బాధ్యత ● ఐ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోంపల్లి శ్రీకాంత్ పిలుపు



ఉరవకొండ, మార్చి16: సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని కాపాడుకోవాలని, చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి ప్రపంచ నలుమూలలా ఉన్న తెలుగు వారందరూ కదలి రావాలని ఐ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోంపల్లి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారని, పోలింగ్‌కు 55రోజులు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే ఈ ఎన్నికల్లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరూ కీలకపాత్ర పోషించాలన్నారు. ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలనలో ప్రజాస్వామ్య, ప్రభుత్వ వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికవ్యవస్థ పతనావస్థకు చేరుకుందన్నారు. వీటిని సరిదిద్దడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. ఏపీలో నిరుద్యోగం సమసి పోవాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. వైసీపీని ఓడించాలన్న సంకల్పంతో ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు.

నెమలి వాహనంపై చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ,మార్చి16: పట్టణంలోని గవిమఠంలో వెలసిన చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మూడోరోజు స్వామి వారు నెమలి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని మఠం నుంచి మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి నెమలి వాహనంపై కొలువుదీర్చారు. గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంట్ రాజన్నగౌడ్, గవిమఠం సిబ్బంది నారాయణస్వామి, మధు, వెంటేశులు, రఘు, వీరశైవసంఘం నాయకులు, వీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేడు అడ్డపల్లకి ఉత్సవం

చంద్రమౌళీశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అడ్డపల్లకి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. స్థానిక వెలిగొండ రహదారిలో విడిది మఠం నుంచి పీఠాధిపతిని అడ్డపల్లకిపై పట్టణంలోని వీ ధుల గుండా ఊరేగిస్తారు. ఈ ఉత్సవాన్ని వడ్డెర్ల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీ.



ఉత్సవాలలో పాల్గొన్న ఉత్తరాధికారి, కమిషనర్

గేట్‌లో 359 ర్యాంక్



శ్రీచరణ్

అనంతపురం సెంట్రల్, మార్చి 16: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇంజనీరింగ్(గేట్-2024)లో అనంత విద్యార్థి శ్రీచరణ్ జాతీయ స్థాయిలో 359 ర్యాంక్ సాధించాడు. నగరానికి చెందిన పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) డాక్టర్ రత్నకుమార్, రాధాదేవి దంపతుల కుమారుడు శ్రీచరణ్ ఎన్ఐటీ సూరత్కల్‌లో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు శిక్షణ ఇస్తూనే తాను 359 ర్యాంక్ సాధించడం గమనార్హం. కృత్రిమ మేధస్సు(ఏఐ) వంటి రంగాల్లో ఉద్యోగాలకు ర్యాంక్ ఉపయోగపడుతుందని శ్రీచరణ్ పేర్కొన్నారు.

24న రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 16: రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్-2024 పోటీలు ఈనెల 24న నగరంలో నిర్వహిస్తున్నట్లు ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, ఇటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు తెలిపారు. పోస్టర్లను శనివారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో డీఎస్‌డీఓ నరసింహారెడ్డి విడుదల చేశారు. ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ విజేతలు జూన్ 4న భీమవరంలో ఇంటర్నేషనల్ ఫిడే ఓపెన్ రేటింగ్‌చెస్ టోర్నీలో పాల్గొంటారన్నారు. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలరాజు, డైరెక్టర్ జగదీష్‌బాబు, కిశోర్‌నాయుడు, గోవిందరాజులు, కోచ్ మెహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

శింగనమల,మార్చి16: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాచేపల్లి పంచాయతీ కార్యదర్శి బీఎల్ఓ డొక్క కృష్ణకు ఎంపీడీఓ రమణ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి డొక్క కృష్ణ నార్పలలో వైసీపీ అభ్యర్థి వీరాంజనేయు ప్రచారంలో పాల్గొన్నారు. దిన పత్రికలు, సోషల్ మీడియాలో ప్రచారం వార్తలు రావడంపై స్పందించిన ఎంపీడీఓ రమణ కార్యదర్శికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

బాడుగ ఈకుండా యాడికిపోతారు ?

● బెళుగుప్పలో సచివాలయం-2కు తాళం
● అద్దె చెల్లించి సామగ్రి తరలించాలని అడ్డగించిన యజమాని



అద్దె ఇవ్వనందున మరోసారి సచివాలయానికి తాళం

బెళుగుప్ప, మార్చి 16: మండల కేంద్రంలో సచివాలయం-2 నిర్వహిస్తున్న భవనానికి అద్దె చెల్లించకపోవడంతో యజమాని శనివారం తాళం వేశారు. బెళుగుప్పలో సచివాలయం-2 నిర్వహణకు నాగమ్మ అనే మహిళ తన భవనాన్ని అద్దెకు ఇచ్చింది. అద్దె సక్రమంగా చెల్లించక పోవడంతో రూ.1.5 లక్షల బకాయి పేరుకుపోయింది. దీంతో గత నెల 28న భవనానికి తాళం వేశారు. అయితే వారంలోగా చెల్లిస్తామని ఈవోఆర్డీ మాధవరెడ్డి చెప్పడంతో ఒప్పుకుని తాళాలు ఇచ్చారు. 20 రోజులు గడిచినా అద్దె చెల్లించకుండా అదిగో ఇదిగో అంటూ తిప్పుకున్నారు. ప్రస్తుతం అద్దె బకాయి ఇవ్వకుండానే ప్రభుత్వ భవనంలోకి తరలించడానికి అధికారులు ప్రయత్నించారు. తమ బకాయి చెల్లించి సామగ్రి తరలించాలని యజమాని తాళాలు వేసింది. ఈ విషయమై ఈవోఆర్డీ మాధవరెడ్డి మాట్లాడుతూ మార్చి నెలలో డిజిటల్‌కీ రెన్యువల్ చేయించాలని, అందువల్లే సమస్య నెలకొందన్నారు. డబ్బు ఇవ్వలేకున్నామని చెప్పినా ఆమె వినడం లేదని, రెన్యువల్ అయితేనే బిల్లు మంజూరుకు చర్యలు తీసుకుని పరిష్కరిస్తామన్నారు.



అద్దె ఇవ్వాలని వేడుకుంటున్న యజమానురాలు నాగమ్మ

జాతీయ లోక్ అదాలత్‌లో 6,850 కేసుల పరిష్కారం

అనంతపురం క్రైం,మార్చి16 : జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 6,850 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో మొత్తం 24బెంచులు నిర్వహించారు. బాధిత, ఫిర్యాదిదారులు రాజీకి సమ్మతించడంతో 1247 క్రిమినల్ కేసులు, 142 సివిల్ కేసులు, 5308 ప్రీలిటిగేషన్ కేసులు(పంచాయతీ, మున్సిపల్ టాక్సు కేసులు, బ్యాంకు రికవరీ కేసులు), 66 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులకు పరిష్కారం దక్కింది. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ప్రమాద భరిత కేసులలో రూ.3,81,65,000లను కక్షిదారులకు పరిహారం ఇప్పించటానికి రాజీమార్గంగా పరిష్కరించారు. సివిల్ కేసులలో రూ.1,14,92,964 ప్రీలిటిగేషన్ కేసులలో రూ.1,31,19,500 కక్షిదారుల మధ్య రాజీ ప్రకారం ఇప్పించారు. లోక్ అదాలత్ నిర్వహణను జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి, కార్యదర్శి దీన పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు : ఎస్పీ

అనంతపురం క్రైం,మార్చి16 : జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 సర్వీసెస్ స్ర్కీనింగ్ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన 33 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పది మందికి తగ్గకుండా బందోబస్తు చేపట్టామన్నారు. ప్రశ్నాపత్రాల బాక్సులను ఆయా సెంటర్లకు తరలించే సమయంలో సాయుధ పోలీసు బృందాల సెక్యూరిటీ నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎవరికైనా ఇబ్బందులు కలిగితే అభ్యర్థులు తన ఫోన్ నెంబర్ 9440796800కు సమాచారం అందించాలని ఎస్పీ అభ్యర్థులను కోరారు.

స్పందన రద్దు

అనంతపురం టౌన్, మార్చి 16 : సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగిసేవరకు 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టరు గౌతమి శనివారం తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు లోకివచ్చిన నేపథ్యంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన రద్దు కొనసాగుతుందని, జిల్లా ప్రజలు గమనించాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, మార్చి 16: పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ నారాయణస్వామి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత 11 కేవీ విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా డీఆర్ కాలనీ, డీబీ కాలనీ, లక్ష్మీపురం, శ్రీకంఠపురం, నానెప్పనగర్, మోడల్ కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ సందరంగా ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మద్దిలేటి

రొద్దం, మార్చి 16 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మద్దిలేటి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా కొడుమూరు జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై రొద్దం కళాశాల ప్రిన్సిపాల్ బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఎఫ్ఏసీ పిన్సిపాల్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మి ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్‌కు కళాశాల అధ్యాపకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నేడు మూర్ఛ వ్యాధి చికిత్స శిబిరం

మడకశిరటౌన్, మార్చి 16: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక వేణుగోపాల స్వామి దేవాలయం ఆవరణంలో మూర్ఛవ్యాధి ఉచిత చికిత్స శిబిరం ఏర్పాటు చేసినట్లు జేవీవీ జిల్లా కార్యదర్శులు వీజీ శ్రీనివాసులు, నరసింహమూర్తి తెలిపారు. నియోజకవర్గంలో మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో శిబిరం నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా అమరజీవి జయంతి

హిందూపురం అర్బన్, మార్చి 16: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని పలువురు కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని ఆర్యవైశ్య నాయకులతో పాటు పలువురు పట్టణంలోని చిన్న మార్కెట్‌లో ఆయన విగ్రహానికి శనివారం పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు మాట్లాడుతూ... నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛాయుత ప్రత్యేక రాష్ట్రం పొట్టి శ్రీరాములు త్యాగఫలితమే అన్నారు. అంతటి మహనీయుడు జన్మించిన కులంలోలో పుట్టినందుకు తాము గర్వపడుతున్నామన్నారు.

బూదిలిలో రెండిళ్లలో చోరీ

గోరంట్ల, మార్చి 16: మండలంలోని బూదిలి గ్రామంలో రెండు నివాస గృహాల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన బయ్యప్ప, పూజారి లక్ష్మీదేవి ఇళ్లకు వేసిన తాళాలు పగులకొట్టి రెండు బంగారం ఉంగరాలు, రూ.20వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. హిందూపురంలోని మనువడు, మనవరాళ్లను చూడడానికి ఇంటికి తాళం వేసి బయ్యప్ప కుటుంబంతో పాటు వెళ్లాడు. అలాగే పక్క ఇంట్లో నివాసం ఉంటున్న పూజారి లక్ష్మీదేవి గుడిబండ సమీపంలోని దంపర్తి గ్రామంలో ఉంటున్న కుమారైను చూడడానికి సోమవారం వెళ్లింది. అయితే శనివారం ఉదయం ఇరుగు పొరుగువారు ఫోన్ చేసి వారిరువురి ఇళ్లలో చోరీ జరిగినట్లు సమాచారం అందించారు. దీంతో వారు స్వగ్రామానికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బయ్యప్ప ఇంట్లోని బీరువాను బద్దలుకొట్టి రూ.పదివేలు నగదు, లక్ష్మీదేవి ఇంట్లో బీరువాలో ఉంచిన రెండు బంగారం ఉంగరాలు, రూ. పదివేల నగదు ఎత్తుకెళ్లారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

యవకుడి ఆత్మహత్య


నరసంహమూర్తి(ఫైల్)

మడకశిర రూరల్, మార్చి 16: మండలంలోని మణూరుకు చెందిన నరసింహమూర్తి(33) అనే యువకుడు శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన మేరకు.. నరసింహమూర్తి కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు మద్యానికి బానిస కావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. దీంతో మనస్తాపం చెంది మణూరు సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సువర్ణమ్మ, తల్లి జయమ్మ, ఇద్దరు కుమారులున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. భార్య సువర్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

బిసలమానేపల్లిలో మహిళ...

లేపాక్షి, మార్చి 16 : మండలపరిధిలోని బిసలమానేపల్లిలో ఓ మహిళ శనివారం అనారోగ్య సమస్యలతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. బిసలమానే పల్లికి చెందిన కురుబ అశ్వత్థప్ప భార్య అనసూయమ్మ (45) దివ్యాంగురాలు. అంతేగాకుండా ఆమె కొంతకా లంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతుండేది. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలున్నారు. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కారు బోల్తా - ఒకరికి స్వల్పగాయాలు


అదుపుతప్పి బోల్తాపడిన కారు

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), మార్చి 16 : బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు మండలంలోని నల్లగొండ్రాయనపల్లి వద్ద బోల్తాపడడంతో ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల మేరకు.... బెంగళూరు నుంచి ఓ కారు డ్రైవర్ సహా నలుగురు ప్రయాణికులతో 44వ జాతీయ రహదారిపై హైదరాబాద్ వెళ్తోంది. అయితే నల్లగొండ్రాయనపల్లి రహదారి వద్దకు రాగానే కారు ముందు అద్దంపైకి పురుగు వచ్చింది. డ్రైవర్ దానిని తొలగించే క్రమంలో కారు అదుపుతప్పి బోల్తాపడిందన్నారు. అయితే ఈ ప్రమాదంలో కారులోని ప్రతీక్ చక్రవర్తికి స్వల్పగాయాలయ్యాయని, ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై బాధితులు ఫిర్యాదు చేయలేదని, కేసుకూడా నమోదు చేయలేదని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

అరాచక పాలనకు అంతిమ ఘడియలొచ్చాయ్

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత


కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సవిత

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), మార్చి 16 : రాష్ట్రంలో ఐదేళ్లుగా సీఎం జగన్ సాగించిన అరాచక పాలనకు అంతిమ ఘడియలు దగ్గరపడ్డాయని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే సవిత పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె శనివారం సోమందేపల్లి మండలంలోని నాగినాయనిచెరువు, తుంగోడు పంచాయతీల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లోని 50కుటుంబాలు అధికార పార్టీ వైసీపీ వీడి టీడీపీలో చేరాయి. వారికి సవిత కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... బడుగు బలహీనవర్గాల వారికి న్యాయం జరిగేది ఒక్క టీడీపీ తోనే అన్నారు. టీడీప మినీమేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివ రించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీరుగంటి చంద్ర, అనసూయమ్మ, చంద్రకాంతమ్మ, టీడీపీ పెనుకొండ మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు సీఎం కావాలి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్


టీడీపీలో చేరిన వారికి కండువా వేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న, సునీల్ కుమార్

మడకశిరటౌన్, మార్చి 16: నవ్యాంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం టీడీపీ అధినేత చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. చంద్రబాబు బాధ్యతలు చేపడితేనే రాష్ట్రంలో పాలన గాడిలో పడుతుందన్నారు. పట్టణంలోని పావగడ రోడ్డులో ఉన్న టీడీపీ నూతన కార్యాలయంలో శనివారం వైసీపీ మాజీ ఎంపీపీ బొజ్జప్ప, చందకచర్ల సర్పంచ్ దేవలనాయక్ తమతమ అనుచరులతో కలిసి దాదాపు వంద కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నాయి. వారికి మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఈరన్న, సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను జీర్ణించుకోలేక అనేక మంది టీడీపీలోకి చేరుతున్నారన్నారు. రాష్ట్రంలో ఈ ఐదేళ్ల కాలలో సీఎం జగన్ సాగించిన అక్రమాలు, అవినీతి, అరాచక పాలనతో ప్రజలు విసిగెత్తారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తథ్యం అన్నారు. భవిష్యత్తు తెలుగుదేశంపార్టీదేనని, మడకశిర నియోజకవర్గంలో పార్టీ విజయం కోసం అందరం సమష్టిగా కృషి చేద్దామని పిలుపు నిచ్చారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

పట్టణంలోని పావగడ రోడ్డులో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని శనివారం ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న ప్రారంభించారు. ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలకు, నాయకులకు అనువుగా విశాలమైన ప్రదేశంలో పార్టీ కార్యాలయం ఉండాలన్న సంకల్పంతో ఇక్కడ కార్యాలయం ఏర్పాటు చేశామని వారు తెలిపారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేవిధంగా నూతన కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ వివాదంలో వ్యక్తిపై దాడి

రొళ్ల, మార్చి 16: మండలంలోని జీబీ హళ్లి పొలిమేరలో భూ తగాదా విషయంగా ఘర్షణ చోటు చేసుకొంది. జీబీ హళ్లి పొలిమేరలో ఉన్న భూమి విషయమై.... మండలపరిధిలోని బీరనపల్లికి చెందిన శివన్న అనే వ్యక్తిని జీబీ హళ్లికి చెందిన దంపతులు బసవరాజు, చంద్రకళ ఇద్దరూ తాళ్లతో చేతులు వెనక్కు కట్టి కొడవలితో రెండు కాళ్లను నరికి తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న శివన్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. బాధితుడిని రొళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్సలు అందించారు. అనంతరం వైద్యసూచనల మేరకు 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శివన్న భార్య అమ్మాజక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ


పురం లోక్ అదాలత్‌లో కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయాధికారి

హిందూపురం, మార్చి 16: రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే అదే రాజమార్గమని హిందూపురం జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. కోర్టులో శనివారం మెగా లోక్ ఆదాలత్‌ని పురస్కరించుకొని 124 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి న్యాయాధికారి మాట్లాడుతూ.. కేసులను పరిష్కరించకోకపోతే కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా చితికిపోతారన్నారు. జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీధర్ రెండు బెంచ్‌ల ద్వారా 124 కేసులు పరిష్కరించారు. ఇందులో కక్షిదారులకు రూ. 65,44,500 ఇప్పించగా, రూ. 2 లక్షలకు పైబడి అపరాధ రుసుం విధించారు. లోక్ అదాలత్‌లో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు. లోక్ అదాలత్ సభ్యులు సిద్దు, కళావతి, పార్వతి, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సుదర్శన్, నాగరాజు రెడ్డి, కేశవరెడ్డి, ఈశ్వరప్ప, శారద, హేమావతి పాల్గొన్నారు.

మడకశిరలో 108 కేసుల పరిష్కారం

మడకశిరటౌన్: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 108 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. అందులో బ్యాంకుకు సంబంధించి ఏడు కేసులు పరిష్కారం కాగా రూ.9.80లక్షల నగదు రికవరీ అయింది. అలాగే 17 క్రిమినల్ కేసులకు రూ.46వేలు, 55 ఎఫ్‌టీసీ కేసులకు రూ.31,800 నగదు రికవరీ చేశారు. ఎక్సైజ్ కేసులు 27 పరిష్కారం కాగా రూ.1,00,345 రికవరీ అయినట్లు తెలిపారు. ఎన్ఐఏ యాక్టుకు సంబంధించి 2 కేసులు పరిష్కారం కాగా రూ.5లక్షల నగదు రికవరీ అయినట్లు తెలిపారు. మొత్తం 108 కేసుల పరిష్కారానికిగాను రూ.16.58లక్షలు నగదు రికవరీ అయినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. ఈకార్యక్రమంలో మడకశిర జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఆర్ అశోక్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మరో సారి అధిష్టానంతో చర్చిస్తా

మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప


సమావేశంలో మాట్లడుతున్న మాజీ ఎంపీ నిమ్మల

గోరంట్ల, మార్చి 16: పుట్టపర్తి అసెంబ్లీ టిక్కెట్ ఆశించి, భంగపడ్డ తాను మరో అవకాశం కోసం టీడీపీ అధినాయకత్వంతో చర్చించనున్నట్లు మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప తెలిపారు. గోరంట్లలోని ఆయన నివాసం వద్ద పుట్టపర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో బీసీ కులాలు అధికంగా ఉండడంతో వారి సంక్షేమం కోసం కొంతకాలంగా టిక్కెట్ ఆశించి పనిచేశానన్నారు. అన్నివిధాల అనుకూలంగా ఉన్నప్పటికి చివరిలో అధిష్టానం తన అభ్యర్థనను తిరష్కరించడంతో తీవ్రస్థాయిలో మనస్తాపానికి గురయ్యాయన్నారు. ఓ దశలో ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని భావించానని, పార్టీకి రాజీనామా చేయాలంటే బాధకలిగిందని ఆవేదన చెందారు. తన 40యేళ్ల సుదీర్ఘ రాజకీయచరిత్ర కలిగిన వ్యక్తిగా పార్టీ నియోజకవర్గ శ్రేణుల అభిప్రాయం కోసం అత్యవసర సమావేశం జరిపానన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి తాను ఎప్పుడూ తన టిక్కెట్ కోసం అడిగిందిలేదని, అధిష్టానం తనకు అనుకూలంగా ఉండడంతో తానే పలువురుకి టిక్కెట్ ఇప్పించానన్నారు. ఇప్పుడు తనకుగానీ, తనకుమారుడికిగానీ ఎన్నికల్లో ప్రాధాన్యం కల్పించాలని కోరినా ఫలితం లేకపోయిందన్నారు. తనకు రాజకీయ భవిష్యత్తు ముఖ్యమన్నారు. హిందూపురం పార్లమెంటుకు అవకాశం ఇవ్వాలన్నారు. పుట్టపర్తి అసెంబ్లీకి కూడా అవకాశ ఉందన్నారు. చివరి సారిగా అధినాయత్వంతో సంప్రందించి సరైన హామీ, సముచిత స్థానం కోసం ప్రయత్నిస్తామన్నారు. సానుకూలంగా లేని పక్షంలో పార్టీ శ్రేణులతో మరోసారి సమావేశం నిర్వహించి, తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈసమావేశానికి ఓడీసీ మాజీ ఎంపీపీ ఇస్మాయిల్, కొత్తచెరువు మాజీ జెడ్పీటీసీ గఫూర్, కొత్తచెరువు రఘుపతినాయుడు, కుసుమవారిపల్లి రఘురామిరెడ్డి, సున్నంపల్లి నాగేంద్ర, బుక్కపట్నం వంశీ, ఓడీసీ అల్లాబకాష్, నిమ్మల చంద్రశేఖర్, చింతా భాస్కరరెడ్డి, దేవాంగం కిష్టప్ప, సుబ్రహ్మణ్యం, హంపయ్య తదితరులున్నారు.

లాడ్జి యజమానిపై ఎస్సీ, ఎస్టీ కేసు

పెనుకొండ టౌన్, మార్చి 16: పట్టణంలోని ఇలాహి లాడ్జి యజమాని నజమతుల్లాపై శనివారం ఎస్టీ, ఎస్సీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల మేరకు... పట్టణంలో ఇలాహి లాడ్జ్ , శ్రీ సాయిలాడ్జ్ పక్క పక్కనే ఉన్నాయి. అయితే శ్రీ సాయి లాడ్జ్‌కు సంబంధించిన కస్టమర్ కారు ఇలాహి లాడ్జ్ ఎదుట నిలిపాడు. దీంతో లాడ్జ్‌కు అడ్డంగా ఉన్న కారును తీయాలని ఇలాహిలాడ్జ్ యజమాని శ్రీసాయిలాడ్ మేనేజర్ శ్రీనివాసనాయక్‌కు తెలిపాడు. ఈ నెపథ్యంలో వారిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో తనపై నజమతుల్లా దురుసుగా ప్రవర్తించాడని శ్రీనివాసనాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు నజమతుల్లాపై ఎస్సీ, ఎస్టీ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేరుకే ఉచితం.. చేసేది వ్యాపారం

- మహాప్రస్థానం పేరుతో దోపిడీ
- కలెక్టర్‌కు ప్రైవేట్ అంబులెన్స్‌ల యజమానుల ఫిర్యాదు



హిందూపురం ప్రభుత్వాసుపత్రి

హిందూపురం అర్బన్, మార్చి 16: ప్రభుత్వం పలు ప్రధాన పట్టణాల్లోని ప్రభుత్వాసుపత్రులకు, వాటిలో మృతి చెందిన పేదల మృతదేహాలను ఉచితంగా శ్మశానానికి తరలించేందుకు ప్రభుత్వం మహాప్రస్థానం వాహనాలను ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా వైద్య కళాశాలలున్న పట్టణాలకు ఏర్పటు చేసింది. ఇందు కోసం అయ్యే రవాణా ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. అయితే ఉమ్మడి జిల్లాలో అనంతపురం తరువాత రెండో అతి పెద్దదైన హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రికి వాహనం ఏర్పాటు చేయలేదుకానీ, గత సంవత్సరం అటువంటి వాహన నిర్వహణకు రూ. లక్ష నిధులను విడుదల చేసింది. దీంతో హిందూపురంలో మహాప్రస్థానం వాహనం ఏర్పాటు చేయలేదు. దానికి బదులు వీఐకేఎఫ్(విజన్ ఇన్‌కో) ఫౌండేషన్ వాహనం ద్వారా సేవలు అందిస్తున్నారు. అంత వరకు బాగానే ఉంది. కానీ ఆ వాహనాన్ని మహా ప్రస్థానం లక్ష్యానికేకాకుండా, ఆసుపత్రికి మందులు తీసుకురావడానికి, రోగులను తరలించడానికి కూడా వినియోగిస్తున్నా రని రెండు రోజల క్రితం రిజిస్టర్ పోస్టు ద్వారా జిల్లా కలెక్టర్ అరుణబాబుకు ఫిర్యాదు చేశామని ప్రైవేట్ అంబులెన్స్‌ల యజమానులు తెలిపారు. ఇదిలా ఉంగా ఆ వాహనం పేరుకు మాత్రమే ఉచితమని చెబుతున్నారని ఆరోపిస్తున్నా రు. రోగులనుగానీ, మృతదేహాన్ని తరలించేందుకు డబ్బు వసూలు చేస్తున్నారని అందుకు సంబంధించిన సాక్ష్యాధారాలు తమ వద్ద ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. పురం నుంచి బెంగళూరు, అనంతపురానికి ఉచిత సేవలు అందిస్తున్నామని కేవలం పైకి చెబున్నారన్నారు. అక్కడి కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్ చేయించుకొని, ఆయా ఆసుపత్రుల వారిచ్చే కమిషన్‌ను తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇదేమిటని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగితే వీఐకేఎఫ్ వాహన డ్రైవర్‌తో ఎస్టీ, ఎస్సీ కేసు పెట్టిస్తానని బెదిరిస్తున్నారని కలెక్టర్‌కు పంపిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు వారు తెలిపారు. కరోనా సమయంలో తాము ప్రాణాలకు తెగించి కరోనా బాధితులను, కరోనాతో మృతి చెందిన వారి మృతదేహాలను తరలించామ న్నారు. అంబులెన్సులు నడపుతూ కుటుంబపోషణ సాగించే తమకు న్యాయం చేయాలని అందులో కలెక్టర్‌ను కోరామన్నారు. మా జీవనోపాధిని దెబ్బతీస్తూ, అవనీతి, అక్రమాలకు పాల్పడుతున్న సూపరింటెండెంట్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు ప్రైవేటు అంబులెన్స్‌ల యజమానులు అల్లాబకాష్, ఖాదర్‌ఖాన్, సుబహాన్ తదితరులు తెలిపారు. ఈ విషయంపై డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ ద్వారా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఆధారాలుంటే తమకు పంపాలని, విచారించి చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారులు ఫిర్యాదు దారులకు సూచించినట్లు సమాచారం.

ఎటువంటి తప్పు జరగలేదు

దాతల సహకారంతో నడుస్తున్న విజన్ ఇన్‌కో (వీఐకేఎఫ్)ఫౌండేషన్ ద్వార నిర్వహిస్తున్న వాహనంలో ఎటువంటి తప్పులు జరుగడంలేదు. ఎటువంటి వసూళ్లకు పాల్పడడం లేదు. దాతలు అందించిన వాహనాన్ని ఉచిత సేవలకు మాత్రమే వినియోగిస్తున్నాం. ఎవరితోనూ డబ్బులు వసూలు చేయలేదు. పద్ధతిగా నడుపుతున్నాం. ఈ విషయాలను డీసీహెచ్‌కు కూడా తెలియజేశా. కష్టాల్లో ఉన్నవారికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నాం.

- రోహిల్, సూపరింటెండెంట్, హిందూపురం ప్రభుత్వాసుపత్రి


వీఐకేఎఫ్ వాహనం ద్వారా మందులు తరలిస్తున్న దృశ్యం

పది పరీక్షలకు ఏర్పాట్లు


రొద్దంలోని పరీక్షా కేంద్రానికి బల్లలు తరలిస్తున్న దృశ్యం

లేపాక్షి, మార్చి 16 : మండలకేంద్రంలో సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తీచేశామని ఎంఈఓ నాగరాజు నాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా 971మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మండల కేంద్రంలోని ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాలలోని ఏ, బీ కేంద్రాలు, స్థానిక జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తామని ఎంఈఓ తెలిపారు. ఉదయం 9.30నుంచి 1245వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు సమయానికి ముందే పరీక్షా కేంద్రానికి హాజరు కావాలన్నారు. పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తీచేసినట్లు తెలిపారు.

రొద్దం : మండలకేంద్రంలో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు రంగం సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 12.45 వరకు ఉంటాయన్నారు. రొద్దం కేజీబీవీ పాఠశాలలో 200విద్యార్థులు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ - కేంద్రంలో 250 మంది, బీ - కేంద్రంలో 230మంది పరీక్షలు రాయనున్నారు. ఈ మేరకు అధికారులు ఫ్యాన్‌లు, బల్లలు సమకూర్చినట్లు ఎంఈఓ జయభాస్కర్ తెలిపారు.

ఆలయానికి పంపు సెట్ వితరణ

గోరంట్ల, మార్చి 16: పట్టణంలో ఈడిగ గౌడ సంక్షేమ సంఘం నూతనంగా నిర్మించిన రేణుకా యల్లమ్మ ఆలయానికి గోవర్ధన్ సెల్స్ కంపెనీ వారు సబ్‌మెర్సిబుల్ మోటార్, పంపుసెట్‌ను బహూకరించారు. ఆలయంలో నీటి వసతి కోసం రూ.65వేలు వెచ్చించి మోటారు, పంపుసెట్, స్టాటర్, కేబుల్ అందజేశారు. దాతలు చంద్రావతమ్మ కుటుంబీకులు స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.

కోడ్ కూసింది


రహమత్‌పురం వద్ద ఫ్లెక్సీలు తొలగిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, మార్చి 16: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ శనివారం మధ్యాహ్నం నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో మునిసిపల్ అధికారులు, సిబ్బంది వారి పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికల నియమావళి ప్రకారం పట్టణంలో ఉన్న రాజకీయ నాయకుల పోస్టర్లు తీసివేసే పని ప్రారంభించారు. ఎన్నికల నియమావళి వెలువడిన 24 గంటల్లోగా వాల్‌పోస్టర్లు, గోడల మీద రాతలు వగైరాలు తొలగించే పని ప్రారంభించారు. పట్టణంలో రహమత్‌పురం, శ్రీకంఠాపురం, మెయిన్‌బజార్ తదితర చోట్ల ఉన్న ఫెక్సీలు తొలగించారు.

ఘనంగా సరస్వతి పూజ


పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అగళి, మార్చి 16 : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పదో తరగతి పరీక్షలు సోమవారం జరుగుతున్న నేపథ్యంలో పాఠశాలలో సరస్వతిపూజ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు వరదరాజులు ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు హాజరయ్యారు. విద్యార్థులు కష్టపడి చదివి పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అప్పుడే తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చినవారవుతారన్నారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహానికి ప్రత్యేక అలంకరణచేసి పూలహారాలతో అలంకరించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక ఫీజు వసూలుపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

గుడిబండ, మార్చి 16 : విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు వీరేష్, వినోద్, అంజి తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం గుడిబండ ఎంఈఓ రవిచంద్ర కుమార్‌కు వినతిపత్రం అందించారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులనుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. దీంతో ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని అన్నారు. పాఠశాలల్లో తరగతుల వారీగా ఫీజుల బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే విద్యాశాఖాధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసుల కవాతు



చిలమత్తూరులో కవాతు చేస్తున్న పోలీసులు

చిలమత్తూరు, మార్చి 16: మండలపరిధిలో సమస్యాత్మక గ్రామాలుగా ఉన్న మండల కేంద్రమైన చిలమత్తూరుతో పాటు, కోడూరులో పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. ఎస్ఐ గంగాధర్ ఆధ్వర్యంలో 131 బెటాలియన్ పోలీసులు, బీఎస్ఎఫ్ అధికారులు కలిసి కవాతు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.... ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రధానంగా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు కవాతు చేపట్టామని, అల్లరి మూకలకు హెచ్చరికలు జారీచేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా గతంలో అల్లర్లకు పాల్పడిన వారిని బైండోవర్ చేసి వారిని పోలీసుల నిఘాలో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రశాంతతకు భంగం కలగకుండా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు, మునిమడుగు, కురుబవాండ్లపల్లిల్లో శనివారం కియపోలీస్ స్టేషన్ ఎస్ రంగడు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. త్వరలో జరుగు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భయాందోళనలను తొలగించి ధైర్యం కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఓటర్లు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీసులను సంప్రదించాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డుపైనే మురుగునీరు.. ఇబ్బందుల్లో ప్రజలు


వెంకటగిరిపాళ్యంలో రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు

పెనుకొండ రూరల్, మార్చి 16 : వైసీపీ పాలనలో పంచాయతీలకు నిధుల కొరతతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేయక పోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పెనుకొండ మండలం వెంకటగిరిపాళ్యంలో రోడ్లపైనే మురుగునీరు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో డ్రైన్లు లేకపోవడంతో ఇళ్ల ఎదుట పోసేనీరుకూడా రోడ్లపై చేరి దుర్వాసన వెదజల్లుతోందని అంటున్నారు. చిన్నారులు, వృద్ధుల వరకు రోడ్డుపై జారిపడిన సంఘటనలు ఉన్నాయంటున్నారు. రాత్రిపూట దోమలు విజృంభిస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. సర్పంచుకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు.